చిన్నారులకు ఉచిత కాక్లియర్ ఇంప్లాంటేషన్

కూకట్‌పల్లి: వినికిడి లేని, మాటలు రాని చిన్నారులకు పది లక్షలు ఖరీదు చేసే కాక్లియర్ ఇంప్లాంటేషన్ ఆపరేషన్‌ను ఉచితంగా చేయనున్నట్లు డాక్టర్ రావూస్ ఇయన్‌టి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరావు ఒక ప్రకటనలో తెలిపారు. దురదృష్టవశాత్తు కొంత మంది పిల్లలు పుట్టుకతో వినలేరు, మాట్లాడలేరని.. అటువంటి పిల్లలకు ఇకపై డాక్టర్ రావూస్ ఇఎన్‌టి హాస్పిటల్‌లో ప్రత్యేకమైన పథకం ద్వారా ఉచిత కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీను చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9406778899 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పార్కు సుందరీకరణ పనుల పరిశీలన



మూసాపేట: మూసాపేట డివిజన్ శక్తినగర్‌లో 50 లక్షల వ్యయంతో చేపడుతున్న పార్కు సుందరీకరణ, ఓపెన్‌జిమ్, సిసి రోడ్డు నిర్మాణ పనులను మేరకు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరు చేసినప్పటికి ఎన్నికల వల్ల పనులు మందకొడిగా సాగాయని, త్వరలోనే పార్కు సుందరీకరణ, వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి రెడ్డి, పాండురంగా రెడ్డి, నర్సింగ్, సాయికృష్ణ, ప్రసాద్, అప్పారావు, సుభాష్, మహేష్, రమేష్, సాయి ఈశ్వర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్ శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం 32వ వార్షిక పూజా మహోత్సవంలో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీ గణపతి హోమం, గోమాల పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు పాల్గొని కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ హరిహరపుత్రుని కృప అందరిపై ఉండాలన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

పేద ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాలి



ప్రజా పాలన కేంద్రాన్ని సందర్శించిన కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి: ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సూచించారు. శనివారం సాయంత్రం పలు కేంద్రాలను డిప్యూటి కమీషనర్ కృష్ణయ్య, వివిధ శాఖల అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కొప్పుశెట్టి దినేష్, శేరి సతీష్ రెడ్డి, టిపిసిసి సెక్రటరి యాదగిరి, పుష్పారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బేకరీల్లో సరికొత్త కేకులు

మూసాపేట: నూతన సంవత్సర వేడుకలకు మూసాపేటలోని పలు బేకరీల్లో కేక్‌లు తయారు చేస్తున్నారు. కేకులు కట్ చేసి పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రజలు సన్నద్ధం అవుతున్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇందు కోసం బేకరీల్లో సరికొత్తగా కేక్‌లు అందించనున్నాము, మామూలు రోజుల కన్నా తక్కువ ధరకే కేకులు అందిస్తున్నారు. మరి కొందరు కాంబోలు కూల్ డ్రింక్స్ ఇస్తున్నారు.

ఢిల్లీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికైన యశస్విని



బాలానగర్: ఢిల్లీలో జనవరిలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపుకు ఎంపికైన మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జాతీయ సేవా పథకం వలంటీర్ గుగ్లావత్ శశస్వినిని జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ మంజూర్ హుస్సేన్‌లు శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా తమ యూనివర్సిటీ తరపున యశస్విని రిపబ్లిక్ డేకి అర్హత సాధించటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

గృహిణి ఆత్మహత్య



జయ (ఫైల్)

బాలానగర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సిఐ కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం బాలానగర్ డివిజన్ పరిధిలోని జయ, రమేష్ దంపతులు తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అయితే రమేష్ తాగుడికి బానిసై పని చేయకుండా తిరుగుతుంటాడు. దీంతో కుటుంబ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. పిల్లల చదువులకు కూడా ఇబ్బంది ఏర్పడింది. దీంతో జయ (40) శనివారం సాయంత్రం కోమిటి బస్తీలో తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లిఫ్టులు ఏర్పాటు చేయాలని వినతి

హఫీజ్‌పేట్ : చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో లిఫ్టులు ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులకు శనివారం మాజీ కౌన్సిలర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్ నుంచి నాంపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వృద్ధులు, వికలాంగులు, మహిళలు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారందరికి ఒక ఫ్లాట్ ఫారం నుంచి మరో ఫ్లాట్‌ఫారంకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున రెండు ఫ్లాట్‌ఫారంల వైపు లిఫ్టులు ఏర్పాటు చేయాలని రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పి.డి.మిశ్రాను కోరగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ప్రొ.సమర్‌కుమార్ దాస్‌కు జేసీ బోస్ ఫెలోషిప్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన సీనియర్ ప్రొఫెసర్ సమర్‌కుమార్‌దాస్ ప్రతిష్టాత్మకమైన జేసీబోస్ ఫెలోషిప్‌ను అందుకున్నారు. ఆయన హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్. పునరుత్పాదక శక్తి వనరులు మన నుంచి రోజుకోజుకూ క్షీణించడమే కాదు, నేటి సమాజ అవసరాల నేపథ్యంలో స్థిరమైన/పునరుత్పాదక శక్తిని సాధించడంలో ఆయన చేసిన పరిశోధనకు ఈ ఫెలోషిప్ లభించింది. జేసీబోస్ ఫెలోషిప్ వ్యవధి అయిదేళ్లు. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్

మూసాపేట: నూతన సంవత్సరం వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని, చట్టానికి లోబడి వేడుకలు ఉండాలని లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ఎ. వేణుగోపాల్ అన్నారు. శనివారం కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా ట్రాఫిక్ పోలీసులు కొన్ని పరిమితులు, మార్గదర్శకాలను విలేకరులు సమావేశంలో వివరించారు. నూతన సంవత్సర వేడుకలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమవుతాయని, అంతేకాకుండా మరి కొన్ని కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాత్రి 8 గంటల నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు తెలవని ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్రిబుల్ రైడింగ్, వింత శబ్దాలతో ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దొరికిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని వివరించారు. డ్రగ్స్‌పై కూడా ప్రత్యేక డివైజ్‌తో గుర్తిస్తామని, అనుమానితులను వెంటనే అక్కడే పరీక్షలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఫ్లై ఓవర్లు రాత్రి 8 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మూసివేయనున్నట్లు తెలిపారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారు టికెట్ చూపించి తనిఖీ అనంతరం అనుమతిస్తామని తెలిపారు. టికెట్ ఉన్నప్పటికి మద్యం బాటిళ్లు, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే చర్యలు తప్పవని సూచించారు. పిల్లలు బయటకు వెళ్లకుండా వారి తల్లిదండ్రులే తగు జాగ్రత్తలు తీసుకోవాలని మైనర్లకు వాహనాలను ఇచ్చిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్యాబ్‌లు, కార్లు, ఆటోల వారు తమ పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఫోరం మాల్, జెఎన్‌టియు ఫ్లై ఓవర్, కైత్లాపూర్ ఫ్లై ఓవర్‌లను మూసివేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసిపి వెంకటయ్య, కేపీహెచ్‌బీ సిఐ నర్సింగ్‌రావు, మియాపూర్ సిఐ కిరణ్, కూకట్‌పల్లి సిఐ నగేష్, అడిషనల్ సిఐ శేఖర్, ఆర్‌సి పురం సిఐ పవన్, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో దరఖాస్తులు ఉన్నాయి



ప్రజా పాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేత జగదీశ్వర్ గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: ప్రజా పాలన కేంద్రాల్లో అవసరాలకు అనుగుణంగా దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఫేజ్2 కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌లోని హెచ్‌యంటి హిల్స్ కమ్యూనిటీ హాలులో సంక్షేమ పథకాల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ కూడా సెంటర్‌లకు వెళ్లి డబ్బులు ఇచ్చి దరఖాస్తులను తీసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని, ఏమైనా ఇబ్బందులుంటే సంబంధి అధికారులను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. సెంటర్‌లలో నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకొని, ప్రజలకు అన్ని విధాల అర్థం అయ్యేలా వివరించాల్సిందిగా సూచనలు అందచేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, నాయకులు, యూత్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

గచ్చిబౌలి: కొత్తగూడ, సఫారినగర్‌లోని న్యూబ్లూమ్స్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హోలిస్టిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పరిసర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని వారు తెలిపారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు

రాయదుర్గం: అయోధ్య రామాలయం అక్షింతల ఊరేగింపు కార్యక్రమాన్ని శనివారం రాత్రి టెలికామ్‌నగర్‌లో నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం నుంచి కాషాయపతాకాలతో జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీవాసులు డి రవీందర్‌రెడ్డి, దినేష్‌యాదవ్, వెంకటేష్, శివసింగ్,విఠల్, గోపాల్, స్థానికులు పాల్గొన్నారు.

అభినందన

రాయదుర్గం: రాష్ట్ర హోంగార్డుల గౌరవ అధ్యక్షుడు తాండూరు శాసనసభ్యులు బి మనోహర్‌రెడ్డిని రాష్ట్ర హోంగార్డుల సంఘం ప్రతినిధులు శనివారం కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు దయానంద్‌స్వామి ఆధ్వర్యంలో మనోహర్‌రెడ్డిని అభినందించారు. హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చూడాలని కోరినట్లు సైబరాబాద్ హోంగార్డుల సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్ తెలిపారు.

ప్రజా పాలన అదనపు కేంద్రాన్ని ఏర్పాటు చేయండి



డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం, జీహెచ్‌యంసి డిప్యూటి కమిషనర్ రమేష్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేయాలని విన్నవించారు. రాజీవ్ గాంధీనగర్, సఫ్దార్‌నగర్, యూసుఫ్ నగర్ లలో అదనంగా మరో సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ మూడు బస్తీల్లో అర్హులైన పేదలు ఎక్కువగా వస్తున్నారని సెంటర్ పెంచితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. ఆర్‌కే సొసైటీలో ఏర్పాటు చేసిన సెంటర్ దూరంగా ఉండటంతో ఇబ్బందికి గురవుతున్నారని తెలిపారు.

నకిలీ మందుల తయారీ రాకెట్ గుట్టురట్టు





మూసాపేట: కూకట్ పల్లి ప్రశాంత్ నగర్ లో నకిలీ మందుల తయారీ రాకెట్ ను తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు శనివారం పట్టుకున్నారు. లైసెన్స్ లేకుండా గ్యాస్, అల్సర్ మందులను తయారు చేసి సరఫరా చేస్తున్న కంపనీపై దాడి చేసి మందులను స్వాధీనం చేసుకుని కంపెనీని సీజ్ చేశారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.... కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్ లోని రాజీవ్ గాంధీనగర్ లో రామ్స్ ఫార్మాస్యూటికల్ పేరుతో కొచికా రంజిత్ కుమార్, పవన్, షేక్ సుభానిలు నకిలీ మందులను తయారు చేస్తున్నారు. వీరు ఎలాంటి డ్రగ్ లైసెన్స్ తీసుకోకుండా ఫుడ్ సప్లిమెంటరీ తయారీ ముసుగులో పంజాబ్ కు చెందిన కంపెనీ పేరుతో నకిలీ గ్యాస్ , అల్సర్ మందులను తయారు చేస్తున్నారు. ఫుడ్ లైసెన్స్ తీసుకొని జీపీ డైలీ పార్సిల్ ద్వారా నిజామాబాద్ లోని బయో మెడిక్ ఫార్మా స్యూటికల్స్ కు సరఫరా చేస్తున్నారు. నిజామాబాద్ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు గుర్తించి మేడ్చల్ అధికారులను అప్రమత్తం చేయడంతో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ , డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సహజ, అధికారులు బిందుశ్రీ ఆకస్మికంగా ప్రశాంత్ నగర్ రాజీవ్ గాంధీ నగర్ లోని రామ్స్ ఫార్మాస్యూటికల్ కంపనీ పై దాడి చేసి ట్యాబ్లెట్లు , లేబుల్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు 6 లక్షలు ఉంటుందని తెలిపారు. రామ్స్ ఫార్మాస్యూటికల్ కంపనీ యజమాని లు స్రవంతి, భర్త కొచికా రంజిత్ కుమార్ సూచనల మేరకే నకిలీ మందులు తయారు చేసినట్లు కంపనీ ప్రొడక్షన్ ఆపరేటర్ షేక్ సుభాని తెలిపారని పేర్కొన్నారు.

ప్రపంచ పోకడలను అధ్యయనం చేయాలి



రాయదుర్గం: మేనేజ్‌మెంట్ కోర్సు చదివే విద్యార్థులు గ్లోబల్ మేనేజర్లుగా ఎదగాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ జివిఆర్‌కే ఆచార్యులు సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలలో భాగంగా గోపన్‌పల్లిలోని సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో 'గ్లోబల్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌లో ఆధునిక పోకడలు' అనే అంశంపై జాతీయ సదస్సును ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో విద్యార్థులు వర్చువల్ మోడ్‌లో చదువుకోవచ్చన్నారు. టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలలో ప్రపంచ పోకడలను అధ్యయనం చేయాలని, అందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ చంద్రమౌళి మాట్లాడారు. హెచ్‌ఓడీ ప్రొఫెసర్ టి రవి మాట్లాడుతూ నిర్ణయం, అమ్మకాలు, మార్కెట్, బ్యాంకింగ్ రంగం, కస్టమర్ సేవ వంటి నిర్వహణ రంగంలో కృత్రిమ మేధస్సు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం ప్రొఫెసర్ ఆచార్యులు, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ చంద్రమౌళి చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సేయింట్ జేవియర్స్ పీజీ కళాశాల కరస్పాండెంట్ కె సుధీర్, చైర్మన్ టి రాఘవరెడ్డి, పలువురు ఫ్యాకల్టీ సభ్యులు, అధికారులు, ఎంబీఏ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరిస్తాం



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పోరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట చెరువులో డ్రైనేజీ నీరు చేరుతోందని కాలనీ వారు ఇచ్చిన సమాచారం మేరకు శనివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు జీహెచ్‌యంసి ఏఈతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిందికుంట చెరువులో డ్రైనేజీ నీరు చేరుతోందని దానితో దుర్వాసన వెదజల్లి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రజలు ఇబ్బంది పడకుండా యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలని తెలిపారు.కార్యక్రమంలో జీహెచ్‌యంసి ఏఈ రాజీవ్, సిబ్బంది, కాలనీ వాసులు రావూరి శ్రీనివాస్, పెండ్యాల శ్రీను, గుంటుపల్లి శ్రీనివాస్, వంశీ, సురేష్, సంజీవరావు, సుందర్, రవికుమార్, నాగేంద్ర, బాలకృష్ణ, రవికాంత్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రజా పాలన కేంద్రాన్ని పరిశీలించిన సిటీ ప్లానర్ రాజేంద్ర నాయక్

ఉదయం నుంచే బారులు





అల్లాపూర్ వివేకానందనగర్‌వార్డు కార్యాలయంలో భారీగా వచ్చిన ప్రజలు

మోతీనగర్: ప్రజాపాలన కేంద్రాలకు మూడవరోజు దరఖాస్తుదారులు ఉదయం నుంచే బారులు తీరారు. సమయంపై అధికారులు స్పష్టంగా చెప్పకపోవటంతో తెల్లవారుజాము నుంచే ప్రజలు చలిగాలుల్లో వేచి చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్ మీ సేవా కేంద్రం, పాండురంగానగర్ పార్కులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలకు ఉదయం నుంచే చలిని తట్టుకొని భారీ క్యూలైన్లలో నుంచుంటున్నారు. అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్, పర్వత్‌నగర్ మినీ కమిటి హాలు, ఆర్‌కే సొసైటీ సిటి కోర్టు, వి.రామారావు నగర్ కమ్యూనిటీ హాలులో కూడా ఇంకా భారీ ఎత్తున దరఖాస్తుదారులు వస్తున్నారు. దీంతో అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు. మూసాపేట పాండురంగా నగర్ పార్కులో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాన్ని శనివారం సిటీ ప్లానర్ రాజేంద్ర నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తుదారునికి దరఖాస్తులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.

ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్



కూకట్‌పల్లి: నిజాంపేట రోడ్డులోని కొలన్ నారాయణ రెడ్డి గార్డెన్స్‌లో కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా వారి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని 65 శాతం వరకు రాయితీ ఇస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. అన్ని రకాల చేనేత కళాకారులతో నేయబడిన కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచామని నిర్వాహకులు వినోద్ తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కళాకారులతో తయారు చేసిన చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచామన్నారు. వివాహాలకు, శుభకార్యాలకు సంబంధించిన అన్ని రకాల వస్త్రాలు లభించునని తెలిపారు. చేనేత కళాకారులకు అండగా నిలవడానికి ఇటువంటి ఎగ్జిబిషన్లు ఉపయోగపడుతున్నాయన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా కొనుగోలుదారులకు నాణ్యమైన వస్తువులు అందజేయనున్నట్లు తెలిపారు. వస్త్ర మేళాల ద్వారా చేనేత కార్మికులకు ఎన్నో ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

మట్టికుప్పలతో ప్రమాదాలు

- ఉపకమిషనర్ వంశీకృష్ణకు వినతి

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంటలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని పూర్తి చేయాలని శనివారం చందానగర్ ఉపకమిషనర్ వంశీకృష్ణకు స్థానిక నాయకులు కార్తీక్‌గౌడ్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేముకుంట వీకర్ సెక్షన్‌లో సీసీ రోడ్డు తవ్వి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం పైప్‌లైన్ వేస్తున్నారన్నారు. ఐతే తవ్విన మట్టిని తొలగించలేదన్నారు. దీంతో మట్టి కుప్పల వల్ల రాత్రి సమయాలలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్!

ఇప్పటివరకు పేరుకుపోయిన బకాయిలు, పన్నులపై దృష్టి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో పాత బకాయిలతో పాటు వంద శాతం పన్నుల వసూళ్లపై కార్యాచరణ ప్రణాళికపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. వచ్చే మార్చితో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో లక్ష్యాన్ని అధిగమించేందుకు పురపాలక సంఘాలు, జీపీలు ప్రత్యేక డ్రైవ్‌పై దృష్టి సారిస్తున్నాయి. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపడం ద్వారా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళలో ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలని భావిస్తోంది. మూడు నెలలు మాత్రమే గడువు ఉండటంతో.. ప్రజా పాలన కార్యక్రమం ముగిసిన తర్వాత బృందాలను రంగంలోకి దింపి, ప్రత్యేక డ్రైవ్ చేపట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల కారణంగా దాదాపు మూడు నెలలు పన్నుల వసూళ్లకు బ్రేక్ పడింది. త్వరలో పార్లమెంట్,పంచాయతీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో.. పట్టణాలు, జీపీల్లో పన్నుల వసూళ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. లేనిపక్షంలో పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడే అవకాశం లేకపోలేదని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పన్నుల లక్ష్యం చేరుకునేందుకు శతవిధాలా ప్రయత్నించాలని భావిస్తోంది.

పన్నుల లక్ష్యం రూ.202 కోట్లు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 13పురపాలక సంఘాలతో పాటు 61గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.202 కోట్లు కాగా,ఇప్పటి వరకు 60శాతం పన్నుల వసూళ్లు చేశారు.ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల కారణంగా మూడు నెలలు పన్నుల వసూళ్లకు ఫుల్ స్టాప్ పడగా,వచ్చే మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది.ఆలోగా వంద శాతం పన్నుల వసూళ్ల ప్రత్యేక డ్రైవ్‌కు అధికార యంత్రాంగం మొగ్గు చూపుతోంది.మార్చి 31వరకు పన్ను చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు ఇవ్వగా, ఆ తర్వాత చెల్లించిన వారికి రెండు శాతం చొప్పున పన్నుపై వడ్డీ విధిస్తారు. పట్టణాలు, జీపీల్లో ప్రైవేట్ ఆస్తుల పన్నులు సకాలంలో వసూలవుతున్నా..ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్నులు మాత్రం ఏటేటా పెరిగిపోతున్నాయి.

పేరుకుపోయిన వాటితో కష్టాలు..

ఏటా సకాలంలో పన్నులు వసూలు కావడం లేదు. రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోతుండటంతో అభివృద్ధి కార్యక్రమాలకు బ్రేక్ పడుతోంది. దీనికితోడు పురపాలక సంఘాలు, జీపీల్లో పనిచేస్తున్న సిబ్బంది జీతభత్యాలు కూడా సకాలంలో చెల్లించలేని దుస్థితి ఏర్పడుతోంది. అలాంటి పరిస్థితుల నుంచి పట్టణాలు, జీపీలు అధిగమించాలంటే పన్నులు సకాలంలో వసూలు కావాల్సిన అవసరం ఉంది.